క్లుప్తంగా

ఎన్నికల ప్రక్రియలో బీఎల్‌ఓల పాత్ర కీలకం



మాట్లాడుతున్న కర్నూలు నియోజకవర్గ ఆర్‌ఓ ఎస్.రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): ఎన్నికల ప్రక్రియలో బీఎల్‌ఓల పాత్ర కీలకమని కర్నూలు నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి, నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అన్నారు. బుధవారం స్థానిక ఎస్‌బీఐ కాలనీలోని నగర పాలక సంస్థ భవనంలో బీఎల్‌ఓలకు శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో ఇండియన్ ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసీ అండ్ ఎన్నికల మేనేజ్‌మెంట్‌చే ఎన్నికల నిర్వహణపై బీఎల్‌ఓలకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఆరు రోజుల పాటు బీఎల్‌ఓలకు శిక్షణ ఉంటుందని, శిక్షణ అనంతరం 30 మార్కులకు పరీక్ష నిర్వహించి సర్టిఫికెట్ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. తహసీల్దార్ రవికుమార్, డిప్యూటీ తహసీల్దార్ ధనుంజయ, సూపరింటెండెంట్లు సుబ్బన్న, మజూర్ బాషా, ఆర్‌ఐ రాజు, సీనియర్ అసిస్టెంట్ సాధిక్ పాల్గొన్నారు.

సారా బట్టీలపై ఎక్సైజ్ దాడులు



సారా బట్టీలను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

కర్నూలు: కర్నూలు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని గుడుంబాయి తాండా శివారులో నాటుసారా స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి బట్టీలను ధ్వంసం చేశారు. సీఐలు చంద్రహాస్, రాజేంద్రప్రసాద్ తమ సిబ్బందితో బుధవారం సారాబట్టీలపై దాడులు జరిపి సుమారు 1200 లీటర్ల సారాకు వినియోగించే బెల్లం ఊట, 15 లీటర్ల సారాను ధ్వంసం చేశారు. గుడుంబాయి తాండాకు చెందిన వెంకటేష్‌నాయక్‌పై కేసు నమోదు చేశారు. అలాగే ఉప్పలపాడుకు చెందిన దొమ్మర లక్ష్మీదేవి వద్ద 12 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. ఈ దాడుల్లో ఎస్ఐలు నవీన్‌బాబు, మధుసూదన్‌రెడ్డి, ఇంద్రకిరణ్, తేజ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌యూ పీజీ సెమిస్టర్ పరీక్షలకు 57 మంది గైర్హాజరు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న పోస్ట్ గ్రాడ్యుయేషన్, బీటెక్ సెమిస్టర్ పరీక్షల్లో బుధవారం 88 శాతం హాజరు నమోదైంది. పీజీ 4వ సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలకు 480 మందికి 423 మంది విద్యార్థులు హాజరైనట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బీటెక్ 4, 7 సెమిస్టర్ పరీక్షలకు 231 మందికి 231 మందితో వంద శాతం హాజరు నమోదైందని తెలిపారు. వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ వెంకట బసవరావు, రిజిస్ట్రార్ డాక్టర్ బోయ విజయ్‌కుమార్ నాయుడు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

గురుభ్యోనమః

- నేడు గురుపౌర్ణమి
- ముస్తాబైన సాయినాథుని ఆలయాలు
- ఆలయాల్లో కొనసాగుతున్న సాయి నామ అఖండ భజన

కర్నూలు కల్చరల్: జ్ఞానాన్ని అందిస్తూ ఏది మంచో? ఏది చెడో? చెప్పే వారు గురువులు. ఆదిగురువు వేద వ్యాసుడు. ఆయన జయంతినే గురు పౌర్ణమి, వ్యాస పూర్ణిమ అంటారు. గురువులను పూజించడం కోసం నిర్ణయించిన తిథి గురు పౌర్ణమి. గురువులను, ఉపాధ్యాయులను పెద్దలను పూజించే రోజే ఇది. హిందువులు ప్రతి సంవత్సరం ఆషాఢ శుద్ధ పౌర్ణమి రోజున 'గురు పూర్ణిమ' జరుపుకుంటారు. ఈ రోజున గురు పూజోత్సవం జరిపి గురువులకు కానుకలు సమర్పించి, సత్కరించి వారి ఆశీర్వాదాలు తీసుకుంటారు. గురువారం జిల్లావ్యాప్తంగా గురుపూర్ణిమ వేడుకలను జరుపుకోనున్నారు.

మానవాళి ఆదిగురువు వ్యాసుడే..

ఒకరి నుంచి ఒకరికి మౌఖికంగా సాగిన వేద జ్ఞానాన్ని ఒక్కచోటకు చేర్చి నాలుగు విభాగాలుగా విభజించి వేద వాంగ్మయాలను సామాన్యుడి చెంతకు చేరేలా చేయడంలో వ్యాసుడు ఎంతో కృషి చేశాడు. పంచమ వేదంగా పేరు తెచ్చుకున్న మహాభారతాన్ని మనకు అందించిన వ్యాస భగవానుడు జన్మించిన రోజు కాబట్టి ఈ రోజును గురు పౌర్ణమి లేదా వ్యాస పూర్ణిమగా జరుపుకుంటాం. హిందూ మతంలో గురువును భగవంతునికి, భక్తునికి మధ్య సంధాన కర్తగా భావిస్తుంటారు. వేద వ్యాసుడు మానవ జాతికంతటికి మంచి ఆధ్యాత్మిక వారసత్వాన్ని మిగిల్చి వెళ్లాడు. అందుకే ఆయన్ను మానవాళికంతటికీ గురువుగా భావిస్తుంటారు. వేద వ్యాసుని పూర్వ నామం కృష్ణ ద్వైపాయనుడు. వేద కాలపు సంస్కృతినంతా నాలుగు వేదాల్లో ఆయన సంకలనం చేసిన తరువాతే ఆయన్ను వేద వ్యాసుడిగా పిలవడం ప్రారంభించారు.



విద్యుద్దీపాల వెలుగులో షిరిడీ సాయిబాబా దేవస్థానం



సాయినాథుడు

గురు దేవుళ్లకు పూజలు

గురు పౌర్ణమి రోజున చాలా మంది భక్తులు ఉపవాసం ఉంటారు. సూర్యోదయం వేళ ఉపవాసం ఆరంభించి చంద్రోదయం వేళకు ఉపవాసం ముగిస్తారు. చంద్రోదయం చూసిన తరువాత లేదా సాయంత్రం పూజలు ముగిసిన తర్వాత ఆహారం స్వీకరిస్తారు. ఆలయాల్లో నిర్వహించే పూజల్లో పాల్గొని సాయినాథుని దర్శించుకుంటారు. సమాజంలో మానవులు పుట్టినప్పటి నుంచి జీవితం ముగిసే వరకు గురువుతో విడదీయలేని బంధం ఉంటుంది. ఆధునిక కాలంలో ఆధ్యాత్మిక గురువులుగా కోట్లాది మంది షిరిడీ సాయిబాబాను, దత్తాత్రేయ స్వామిని ఆరాధిస్తారు. మనిషి ఆధ్యాత్మికంగా ఔన్నత్యాన్ని కల్పించేందుకు కృషి చేస్తున్న గురు దేవుళ్లందరికీ ఈ సందర్భంగా పూజలు నిర్వహిస్తారు.

సాయినాథుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు

గురుపూర్ణిమ రోజున జిల్లాలోని సాయిబాబా, దత్తాత్రేయుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఆషాఢ శుద్ధ పున్నమి రోజు నుంచి ఆలయాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కొన్ని ఆలయాల్లో గురు పూర్ణిమ సప్తాహ దీక్షలు చేపట్టారు. 'ఓం సాయి.. శ్రీసాయి.. జయ జయ సాయి' అఖండ సాయినామ భజనలు నిర్వహిస్తున్నారు. ఆలయాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. కర్నూలు నగరంలోని దక్షిణ షిరిడీ సాయిబాబా దేవస్థానంతో పాటు 22 సాయిబాబా ఆలయాలు, ఆదిత్య నగర్‌లోని శ్రీ సాయి సుబ్రహ్మణ్యేశ్వర జ్ఞాన మందిరం, అశోక్ నగర్‌లోని ప్రసన్నాంజనేయ ద్వారకా మాయి సాయిబాబా దేవస్థానంలో గురుపూర్ణిమ వేడుకల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశారు. అన్ని ఆలయాల్లో అన్న ప్రసాద వితరణ చేయనున్నారు.

చంద్రబాబు రైతులకు క్షమాపణ చెప్పాలి

లాఠీచార్జ్ చేయడం దారుణం

- వైఎస్ జగన్ పర్యటనల్లో ఉద్రిక్తతలకు ప్రభుత్వమే కారణం
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి



మాట్లాడుతున్న ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు(టౌన్): చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలో చంద్రబాబు ఆదేశాల మేరకే పోలీసులు అత్యంత దారుణంగా వ్యవహరించారని, రైతులపై లాఠీచార్జికి ముఖ్యమంత్రి బేషరతుగా క్షమాపణలు చెప్పాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం ఆయన స్థానిక ఎస్వీ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత వారం రోజులుగా ఉద్దేశపూర్వకంగానే చంద్రబాబు ప్రభుత్వం, పోలీసులు వైఎస్ జగన్ పర్యటనను అడ్డుకునేందుకు ఎన్నో ఆంక్షలు విధించారన్నారు. ఎక్కడికక్కడ రైతులను, పార్టీ కార్యకర్తలను బెదిరించడంతో పాటు నోటీసులు జారీ చేయడం చేశారన్నారు. బుధవారం బంగారుపాళ్యంలో జగన్ పర్యటన సందర్భంగా భయానక పరిస్థితులు సృష్టించి లాఠీచార్జీ చేయడం కుట్ర పూరితమేనన్నారు. మామిడి రైతులు, ధాన్యం రైతులు, మిర్చి రైతులు, పొగాకు రైతులు ఇలా ప్రతి పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు అష్టకష్టాలు పడుతున్నారన్నారు. ఈ ప్రభుత్వానికి విషయం తెలిసినా దున్నపోతు మీద వాన కురిసినట్లుగా వ్యవహరిస్తోందన్నారు. ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకొద్దామంటే వైఎస్ జగన్ పర్యటనలకు ఎక్కడికక్కడ ఆటంకాలు సృష్టిస్తూ చంద్రబాబు నియంతలా అడ్డుపడుతున్నాడన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఒక రాజకీయ పార్టీ స్వేచ్ఛగా కార్యకలాపాలు నిర్వహించుకోలేని పరిస్థితి ఈ రాష్ట్రంలో నెలకొందన్నారు. జగన్ ప్రజల్లో తిరగకూడదనే దురుద్దేశంతోనే ప్రతిసారీ ఉద్రికత్తలకు కారణమవుతున్నారన్నారు. ఈ ప్రభుత్వం సవ్యంగా పనిచేస్తే తమ నాయకుడు రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఎందుకు వస్తుందని ఆయన ప్రశ్నించారు.

సమ్మెకు యునైటెడ్ జర్నలిస్టు ఫోరం మద్దతు



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టిన యూజేఎఫ్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): జర్నలిస్టుల హక్కులను హరిస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను ఖండిస్తూ కార్మికులు చేపట్టిన సార్వత్రిక సమ్మెకు యునైటెడ్ జర్నలిస్టు ఫోరం మద్దతు ఇచ్చింది. బుధవారం నగరంలోని కలెక్టరేట్ ఎదుట ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విద్యాసాగర్, చంద్రమోహన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం కార్మికుల భారీ ర్యాలీలో యూజేఎఫ్ నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జర్నలిస్టుల వేతన భద్రత, పని హక్కులపై లేబర్ కోడ్‌లు తీవ్రంగా ప్రభావం చూపనున్నట్లు చెప్పారు. వెంటనే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరారు. లేదంటే భవిష్యత్‌లో మరిన్ని పోరాటాలు తప్పవని హెచ్చరించారు. వ్యవస్థాపక అధ్యక్ష, కార్యదర్శులు నీలం సత్యనారాయణ, చిన్న రామాంజనేయులు పాల్గొన్నారు.

శక్తి టీమ్ సేవలపై విస్తృత అవగాహన



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కర్నూలు: మహిళల భద్రత కోసం ఏర్పాటు చేసిన శక్తి టీమ్ సేవలపై పోలీసులు జిల్లావ్యాప్తంగా బుధవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, షాపింగ్ మాల్స్, అంగన్‌వాడీ కేంద్రాలు, జనం రద్దీగా ఉండే ప్రదేశాల్లో శక్తి యాప్ గురించి విద్యార్థులు, మహిళలకు వివరించారు. మహిళల భద్రత కోసం శక్తి వాట్సాప్ నంబర్ 79934 85111 వినియోగం గురించి అవగాహన కల్పించారు. అవసరమైన సమయంలో మహిళలు, బాలికలు యాప్ వాట్సాప్ నంబర్‌ను సంప్రదించాలన్నారు. అవి ఏ విధంగా పనిచేస్తాయో వివరిస్తూ గుడ్ టచ్–బ్యాడ్ టచ్ గురించి కూడా అవగాహన కల్పించారు. అత్యవసర సమయాల్లో కాల్ చేసినా, మెసేజ్ చేసినా స్పందించేలా శక్తి వాట్సాప్ నంబర్ పనిచేస్తుందని చెప్పారు. శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవడం వల్ల విద్యార్థులకు రక్షణ, భద్రత ఉంటుందని, ప్రతి ఒక్కరూ శక్తి యాప్‌ను ఫోన్‌లో నిక్షిప్తం చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకోవాలని శక్తి టీమ్ బృందాలు సూచించారు.

నేడు 'సాయి లీలలు' నాటక ప్రదర్శన

కర్నూలు కల్చరల్: గురు పౌర్ణమి పురస్కరించుకొని రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతిక సమితి సౌజన్యంతో గురువారం సాయంత్రం 6.30 గంటలకు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో 'శ్రీ షిరిడీ సాయి లీలలు' చారిత్రక భక్తి నాటకం ప్రదర్శించనున్నట్లు విశ్రాంత ఎస్ఐ, నాటకంలో సాయిబాబా పాత్రధారి, నంది అవార్డు గ్రహీత గుర్రపుసాల అంకయ్య పేర్కొన్నారు. నాటకంలోని చాంద్ పటేల్ పాత్రను మధుర గాయకులు పి.షేక్షావలి, బాలబటేగా ఎస్‌వీ సుబ్బయ్య, మహాల్ సాపతిగా వెంకటేశ్వర్లు, శ్యామగా క్రిష్ణయ్య, భాగోజీగా రామకృష్ణ, తాత్యగా శ్రీనివాసులు, సాతియగా గోవిందరాజులు, లక్ష్మీబాయిగా శారద, నదియాబాయిగా రాధిక నటిస్తున్నారని పేర్కొన్నారు. హార్మోనిస్టు వెంకటేశ్వర్లు, తబలిస్ట్ గోవర్ధన్ సహకారం అందిస్తున్నారని తెలిపారు. సాయి భక్తులు, నాటకాభిమానులు అందరూ పాల్గొనవచ్చని వెల్లడించారు.

ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం



జెండాను ఆవిష్కరిస్తున్న ఏబీవీపీ నాయకులు

కర్నూలు కల్చరల్: అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) 77వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. రాయలసీమ విశ్వవిద్యాలయం శాఖ ఆధ్వర్యంలో బుధవారం వర్సిటీ ముఖ ద్వారం వద్ద ఏబీవీపీ పూర్వ నాయకులు సూర్య, మహేంద్ర తదితరులు జెండాను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. విద్యార్థులను అసాధారణ శక్తులుగా మలచి సమాజంలోని అన్ని రంగాల్లో ప్రతిభావంతులుగా తీర్చిదిద్దే విద్యార్థి సంస్థ ఏబీవీపీ అన్నారు. విద్యార్థి సమాజ హితం కోసం పనిచేయాలనే సంకల్పాన్ని కల్పించే బృహత్తర యజ్ఞ వాటిక అన్నారు. సుదీర్ఘ ప్రయాణంలో అనేక విద్యారంగ సమస్యలపై పోరాటం చేసి విద్యార్థి పక్షాన నిలిచిందన్నారు. 370 ఆర్టికల్, చలో కశ్మీర్, బంగ్లాదేశ్ అక్రమ చొరబాటుదారులకు వ్యతిరేకంగా చలో చికెన్ నేక్, సేవ్ క్యాంపస్ సేవ్ నేషన్ తదితర ఉద్యమాలను చేపట్టిందన్నారు. వర్సిటీ ఏబీవీపీ అధ్యక్షుడు నాయక్, సభ్యులు లోకేష, మల్లికార్జున, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూములను పరిరక్షించాలి

కర్నూలు కల్చరల్: ఆలయ భూములను పరిరక్షించాలని, అన్యాక్రాంతమైన ఆలయాల భూములను స్వాధీనం చేసుకోవాలని దేవదాయ శాఖ ఆర్‌జేసీ చంద్రశేఖర్ ఆజాద్ ఆదేశించారు. బుధవారం నగర శివారులోని జగన్నాథ గట్టులోని శివాలయంలో కర్నూలు, అనంతపురం జిల్లాల సహాయ కమిషనర్లు, ఈఓలతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. దేవస్థాన భూములు దేవదాయ శాఖ ఆధీనంలోనే ఉండాలన్నారు. ప్రైవేట్ వ్యక్తుల పేర్లతో ఉంటే ఆర్‌ఓఆర్ చట్టం ప్రకారం కేసులు నమోదు చేయించాలన్నారు. ఆక్రమణలో ఉన్న భూముల సవరణకు మీసేవలో దరఖాస్తు చేయాలన్నారు. ఆర్‌ఎస్‌ఆర్ ప్రకారం 22ఏ1సీలో ఉన్న భూములు ఇతరుల ఆధీనంలో ఉంటే ఆయా ఆలయాల ఈఓలు, మండల ఇన్‌చార్జ్‌లు వాటిని స్వాధీనం చేసుకోవాలన్నారు. కర్నూలు డీసీ పట్టెం గురుప్రసాద్, కర్నూలు, అనంతపురం సహాయ కమిషనర్లు సుధాకర్‌రెడ్డి, తిరుమల్‌రెడ్డి, డీసీలు ఉరుకుంద, ఆర్‌ఎస్ రంగాపురం మద్దిలేటయ్య, కసాపురం ఈఓలు విజయరాజు, రామాంజనేయులు, వాణి, ఈఓలు పాల్గొన్నారు.

బీమా చట్టాల సవరణ బిల్లును విరమించుకోవాలి



సమ్మె చేస్తున్న ఎల్‌ఐసీ ఉద్యోగులు

కర్నూలు(అర్బన్): పార్లమెంట్ సమావేశాల్లో బీమా చట్టాల సవరణ బిల్లును ప్రవేశపెట్టే ఆలోచనను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం కర్నూలు కార్యదర్శి సునీయకుమార్ కోరారు. ప్రభుత్వ రంగ సంస్థలను, కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసే విధానాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే విడనాడాలనే డిమాండ్‌తో బుధవారం ఎల్ఐసీ ఉద్యోగులు సమ్మె చేపట్టారు. సంఘం అధ్యక్షుడు మక్బూల్‌అహ్మద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సునీయకుమార్ మాట్లాడుతూ.. సంస్థలో రిక్రూట్‌మెంట్, జీఎస్టీ తగ్గింపు, పాత పెన్షన్ విధానం తదితర డిమాండ్లను పరిష్కరించాలన్నారు. ఎల్ఐసీలో ప్రభుత్వం తన వాటాలను ఉప సంహరించుకునే కార్యక్రమం మరోమారు చేపట్టనుందని, దీని వల్ల సంస్థకు పాలసీదారులకు ఏ రకమైన ప్రయోజనం లేదన్నారు. బీమా ప్రీమియంలపై భారంగా మారిన 18 శాతం జీఎస్టీని తగ్గించాలన్నారు. సంస్థలో పనిభారం పెరిగిందని, 3, 4 తరగతుల సిబ్బంది కోసం రిక్రూట్‌మెంట్ తక్షణం చేపట్టాలన్నారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఈ సమ్మెకు లియాఫీ, ఎన్‌ఎఫ్ఐఎఫ్‌డబ్ల్యూఐ, క్లాస్ –1 ఆఫీసర్స్ అసోసియేషన్లు సంఘీభావం ప్రకటించాయి. యూనియన్ నేతలు అంబుజాసింగ్, రమేష్, గజేంద్రరెడ్డి, ఏజెంట్స్ ఘని, క్రాంతి కుమార్, ఉస్మాన్‌భాష తదితరులు పాల్గొన్నారు.

సమయానుసారంగా టీకాలు వేయాలి

కర్నూలు(హాస్పిటల్): గర్భిణులు, ఐదేళ్లలోపు పిల్లలకు సమయానుసారంగా టీకాలు వేయాలని డెమో శ్రీనివాసులు శెట్టి వైద్య సిబ్బందికి సూచించారు. స్థానిక బండిమెట్టలోని 12వ సచివాలయం పరిధిలోని కుమ్మరిగేరిలో బుధవారం వ్యాధి నిరోధక టీకాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డెమో శ్రీనివాసులు శెట్టి మాట్లాడుతూ.. పిల్లలకు పుట్టినప్పటి నుంచి 15 సంవత్సరాల వరకు, గర్భవతులకు టీకాలు ఇప్పించి ఆ వివరాలను మాతాశిశు సంరక్షణ కార్డు, ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదు చేయాలని తెలిపారు. ఏ టీకా ఎందుకు వేస్తున్నారు, ఏ జబ్బు రాకుండా వేస్తున్నారనే వివరాలు తల్లులకు ఆశాలు, ఆరోగ్య కార్యకర్తలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం 18 ఏళ్ల పైబడిన వారికి నిర్వహిస్తున్న అసంక్రమిత వ్యాధుల సర్వే (ఎన్‌సీడీ 3.ఓ) ప్రాముఖ్యత గురించి వివరించారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, వైద్య సిబ్బంది త్రివేణి, గీతమ్మ పాల్గొన్నారు.

ఖర్చు లేకుండా కేసుల పరిష్కారం

కర్నూలు(సెంట్రల్): శాశ్వత లోక్ అదాలత్ ద్వారా పైసా ఖర్చులేకుండా కేసులు, వివాదాలను పరిష్కరించుకోవచ్చని ఆ సంస్థ అధ్యక్షుడు ఎం.వెంకట హరినాథ్, సభ్యులు శివశంకర్‌రెడ్డి, డి.రాజుబాబు సూచించారు. లోక్ అదాలత్ ద్వారా రాజీమార్గంలో గానీ, తీర్పు ద్వారా కానీ కేసు పరిష్కరించుకుంటే హైకోర్టుల్లో అప్పీలుకు అవకాశం ఉండదన్నారు. బుధవారం శాశ్వత లోక్ అదాలత్ బెంచీలో ఆదోనికి చెందిన రూ.25,35,000 విలువ కలిగిన ఆస్తి వివాదాన్ని పైసా ఖర్చు లేకుండా పరిష్కరించారు. ఆదోనికి చెందిన శ్రీలక్ష్మమ్మవ్వ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ నెలవారీగా కంతులు చెల్లిస్తే ఇళ్ల స్థలాలను స్వాధీనం చేస్తామనే బెనిఫిట్ స్కీమ్‌ను ప్రవేశపెట్టింది. దీంతో ఎంతో మంది స్కీంలో చేరి నెల నెలా కంతులు చెల్లిస్తూ వచ్చారు. అయితే మధ్యలో ఆ సంస్థ చెప్పిన విధంగా డిప్‌లో స్థలాల తగిలిన వారికి రిజిస్ట్రేషన్ చేయించకపోవడంతో కొందరు బాధితులు శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించారు. ఈ క్రమంలో ఇరు పార్టీలకు నోటీసులు ఇచ్చి కూర్చోబెట్టి మాట్లాడటంతో రూపాయి ఖర్చు లేకుండా సమస్య పరిష్కారమైంది. ఈ నేపథ్యంలో కక్షిదారులు శాశ్వత లోక అదాలత్‌ను ఆశ్రయించి న్యాయం పొందాలని ఆ సంస్థ అధ్యక్షుడు ఎం.హరినాథ్ సూచించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



ఆర్టీసీ బస్టాండులో లభ్యమైన మృతదేహం

కర్నూలు: కర్నూలు ఏపీఎస్ఆర్టీసీ బస్టాండ్‌లో రిజర్వేషన్ కౌంటర్ పక్కన మూసి ఉన్న శ్రీసాయి రోహిత్ ఫర్నీచర్ షట్టర్ ముందు గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. ప్రయాణికులు ఇచ్చిన సమాచారం మేరకు నాలుగో పట్టణ పోలీసులు అక్కడికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. మృతుడికి 50 ఏళ్ల వయస్సు ఉంటుందని, 5.6 అడుగుల ఎత్తు, ఛామన ఛాయ రంగుతో ఉన్నాడని, బూడిద తెలుపు రంగు చెక్స్ డిజైన్ ఫుల్ షర్టు, ఖాకీ రంగు ప్యాంటు ధరించినట్లు చెప్పారు. మృతదేహంపై ఎలాంటి రక్తగాయాలు లేవు. అతిగా మద్యం సేవించి బోర్ల పడి మృతి చెంది ఉండొచ్చని లేదా అనారోగ్య సమస్యలతో చనిపోయి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించారు. నాలుగో పట్టణ పోలీసులు విచారణ జరుపుతున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలి

కోడుమూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పెట్టే మధ్యాహ్న భోజనం నాణ్యంగా ఉండేలా చూసుకోవాలని స్పెషల్ కలెక్టర్, హౌసింగ్ పీడీ చిరంజీవి హెచ్‌ఎంలు, సిబ్బందిని ఆదేశించారు. బుధవారం గూడూరు మండలం గుడిపాడు, జూకల్, కె.నాగలాపురం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను ఆయన సందర్శించారు. ఆయా పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేయడంతో పాటు విద్యార్థులతో మాట్లాడారు. చదువుతోనే విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని, విద్యార్థుంతా ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని చక్కగా చదువుకోవాలని సూచించారు. అలాగే గురువారం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు మెగా పేరెంట్స్ మీటింగ్‌లే నిర్వహించి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడాలని ఆదేశించారు. కార్యక్రమంలో గూడూరు ఎంఈఓ సునీలమ్మ ఉన్నారు.

3న బహుజన ప్రజా ప్రతినిధులకు సన్మానం



కరపత్రాలను విడుదల చేస్తున్న సంఘాల నాయకులు

కర్నూలు(అర్బన్): దేశంలో కులాలవారీగా జనాభా లెక్కలు చేపట్టాలని అసెంబ్లీ, పార్లమెంట్‌లో తమ గళాన్ని వినిపించి విజయం సాధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, బహుజన ప్రజాప్రతినిధులను ఆగస్టు 3న అనంతపురంలోని లలిత కళ పరిషత్‌లో ఉదయం 10 గంటలకు ఘనంగా సన్మానించనున్నట్లు ఆయా సంఘాల నాయకులు తెలిపారు. ఈ నేపథ్యంలోనే బుధవారం స్థానిక బీ క్యాంప్‌లోని బీసీ భవన్ ప్రాంగణంలో సన్మాన కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, ఐక్యవేదిక అధ్యక్షుడు టి.శేషఫణి, ఆర్‌పీఎస్ రాయలసీమ జిల్లాల కన్వీనర్ శంకర్‌గౌడ్, నాయకులు రాంబాబు, పెరుగు శివకృష్ణ, పీజీ వెంకటేష్, రవికుమార్, వీవీ నాయుడు, ఆనంద్‌బాబు, లక్ష్మీదేవి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కులగణనపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. బీసీలకు చట్టసభల్లో, విద్య, ఉద్యోగాల్లో 44 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, అలాగే దళిత గిరిజనులకు జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు పెంచాలన్నారు.

పెద్దాసుపత్రిలో కీలక పోస్టులన్నీ ఖాళీ

- పర్యవేక్షణ లేక ఇబ్బందులు



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల

కర్నూలు(హాస్పిటల్): సాధారణ బదిలీల్లో భాగంగా నిర్వహించిన బదిలీల్లో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పలు కీలక పోస్టులు ఖాళీగా మారా యి. ఇక్కడ సీఎస్‌ఆర్ఎంఓగా పనిచేస్తున్న డాక్టర్ బి.వెంకటేశ్వరరావు గుంటూరు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వచ్చిన డాక్టర్ సతీష్‌కుమార్ నాలుగు రోజులకే మళ్లీ మరో ప్రాంతానికి బదిలీపై వెళ్లిపోయారు. ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. అలాగే గత కొన్నేళ్లుగా ఏఆర్ఎంఓ పోస్టు ఖాళీగా ఉంది. ఆ బాధ్యతలను అనధికారికంగా ఇద్దరు, ముగ్గురు వైద్యులు చూస్తున్నారు. డిప్యూటీ సూపరింటెండెంట్‌గా పనిచేసిన యూరాలజిస్టు డాక్టర్ సీతారామయ్య పదవీ విరమణ చెందడంతో ఆ స్థానంలో నెలన్నరగా ఎవరినీ నియమించలేదు. అలాగే పరిపాలనా విభాగంలో ఆఫీస్ అకౌంటెంట్/సూపరింటెండెంట్ శ్రీనివాసులు కడపకు బదిలీ కాగా ఆయన స్థానంలో రమేష్‌బాబును నియమించారు. ఆయన ఓ ఉద్యోగ సంఘానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కావడంతో ఇప్పటివరకు రెండు వారాలు దాటినా ఆయన కుర్చీలో కూర్చోలేదన్న చర్చ నడుస్తోంది. ఉద్యోగుల ఎస్టాబ్లిష్‌మెంట్‌కు సంబంధించిన సీటు కావడంతో ఉద్యోగులు వారి సమస్యలు పరిష్కారం కాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాగా సీనియర్ అసిస్టెంట్లు కూడా నలుగురు బదిలీ కాగా ఇద్దరు మాత్రమే ఇక్కడ చేరారు. మరో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కొత్తగా వచ్చిన వారికి సైతం సంబంధిత సెక్షన్లు త్వరగా అర్థం కాని పరిస్థితి. మరోవైపు ఆర్‌ఎంఓలు లేకపోవడంతో ఆసుపత్రిలో పర్యవేక్షణ కొరవడింది. దీంతో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆసుపత్రిలో వైద్యులు, కింది స్థాయి ఉద్యోగులపై పర్యవేక్షణ లేకపోవడంతో ఎవరు పనిచేస్తున్నారు, ఎవరు పనిచేయడం లేదో అర్థం గాని పరిస్థితి. చాలా మంది వైద్యులు విధి నిర్వహణ సమయంలో ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లకు వెళ్లిపోతున్నారు. అలాగే స్టాఫ్‌నర్సులు, పారామెడికల్ సిబ్బంది, నాల్గవ తరగతి ఉద్యోగులు కొందరు ఆలస్యంగా వచ్చి, త్వరగా వెళ్లిపోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.